
andhrajyothy.com శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.3 । కనిష్ఠం 24.2

ఆంధ్రజ్యోతి



ఆదిలాబాద్

జిల్లా వార్తలు

5

ఆదివారం 4 ఆగస్టు 2024

ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

ఆదిలాబాద్ అర్బన్, ఆగస్టు 3: ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని తుడుందెబ్బ వర్కింగ్ ప్రెసిడెంట్ గణేష్ పిలుపునిచ్చారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని కొమురంభీం కాలనీ నుంచి భారీ ర్యాలీ నిర్వహించి స్థానిక టీఎన్జీవోస్ గార్డెన్‌లో సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు గోడం గణేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉయ్యక సంజీవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, తదితరులున్నారు.

జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

● ఆదివాసీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కోట్నక్ దాంశవ్



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కోట్నక్ దాంశవ్

నార్నూర్, ఆగస్టు 3: భారీ వర్షాల కారణంగా పంటపొలాల్లో నీరు చేరి.. పూర్తిగా రైతులు వేసిన పంటలకు నష్టం వాటిల్లిందని, దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉమ్మడి ఆదిలాబాద్‌ను కరువు ప్రాంతంగా ప్రకటించి ఆదుకోవాలని ఆదివాసీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కోట్నక్ దాంశవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని గుండాల గ్రామం రైతులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాంశవ్ మాట్లాడుతూ గత నెల రోజులు భారీ వర్షాలు కురవడం వల్ల పంటపొలాలు నీటిలో మునిగిపోయాయని, దీంతో పత్తి, ఇతర పంటలు నీరుపట్టి ఎండిపోతున్నాయన్నారు. రైతులు అప్పులు ఎలా కట్టలని, వారికి కావాల్సిన ఎరువులు ఎలా తీసుకోవాలని అనే అయోమయం పరిస్థితి ఏర్పడ్డదన్నారు. ఎకరాకు రూ.20 వేల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందించాలన్నారు. ఈయేడు రైతు రుణాలు కూడా బ్యాంక్ వారు మాఫీ చేయాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. సంబంధిత అధికారులు పంట పొలాల నష్టపోయిన రైతాంగాన్ని సర్వే రిపోర్టుని ప్రారంభించి ప్రభుత్వానికి అందజేయాలని, వ్యవసాయం దండగా కాకుండా రైతులను ఆదుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. వారి వెంట రైతులు మేస్రం జంగుకుమ్మరా లింబరావ్, ఆత్రం ప్రకాష్, తొడసం రామారావు, తదితరులు ఉన్నారు.

● జిల్లాకేంద్రం సమీపంలో అక్రమంగా ఏర్పాటు చేసిన లౌఔట్





ఎల్ఆర్ఎస్‌పై.. కదలిక

- » జిల్లాలో మొత్తం 19వేల 367 ఎల్ఆర్ఎస్ (లేఔట్ రెగ్యూలరైజేషన్ స్కీం) దరఖాస్తుల పెండింగ్
- » టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల సమన్వయంతో పరిష్కారం
- » దరఖాస్తుదారుల నుంచి ఆశించిన స్పందన కరువు
- » రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో మున్సిపల్ అధికారుల హడావుడి
- » తాజాగా ఎల్ఆర్ఎస్‌ను తిరిగి పునరుద్ధరించేందుకు ఆదేశాల జారీ
- » జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు కేవలం 63 దరఖాస్తులకే అనుమతి

ఆదిలాబాద్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ (లేఔట్ రెగ్యూలరైజేషన్ స్కీం) పథకంపై ఎట్టకేలకు కదలిక కనిపిస్తుంది. గతంలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన లేఔట్ స్థలాలను క్రమబద్ధీకరించేందుకు 2020లో గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఎల్ఆర్ఎస్‌ను తిరిగి పునరుద్ధరించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో కొన్నేళ్లుగా ఎదురుచూస్తున్న దరఖాస్తుదారులకు ఇబ్బందులు తొలగిపోనున్నాయి. జిల్లాలో 19,430 దరఖాస్తులురాగా ఇప్పటి వరకు కేవలం 63దరఖాస్తులకే అనుమతి లభించింది. దీంతో మున్సిపాలిటీకి రూ.15లక్షల 18వేల 120 ఆదాయం సమకూరింది. మిగితా 19,367 దరఖాస్తులు పెండింగ్‌లోనే కనిపిస్తున్నాయి. అప్పట్లో ఎల్ఆర్ఎస్ పేరిట భారీగా అక్రమాలు జరుగుతున్నాయంటూ ఆరోపణలు రావడంతో గత ప్రభుత్వం దీనిని నిలిపి వేసింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో దరఖాస్తుదారుల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. గతంలో అమలు చేసిన ఎల్ఆర్ఎస్ పథకానికి కొన్ని మార్పులు చేర్పులు చేస్తూ.. తిరిగి అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమయ్యింది. ఈ మేరకు జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. త్వరలోనే ఈ పథక అమలుపై సంబంధిత అధికారులకు ప్రత్యేక శిక్షణను కూడా ఇవ్వనుంది.

పకడ్బందీగా క్రమబద్ధీకరణ

ఎల్ఆర్ఎస్ పథక అమలులో ఎలాంటి అవకతవకలు, అక్రమాలు జరుగకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించింది. గతంలో మాదిరిగా కాకుండా.. ఈ సారి ఎల్ఆర్ఎస్ పథక అమలు బాధ్యతను మూడు శాఖలకు అప్పగించింది. మున్సిపల్ టౌన్ ప్లానింగ్‌తో పాటు రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల సమన్వయంతో దరఖాస్తుల క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టింది. వచ్చిన దరఖాస్తులను మూడు దశల్లో పరిశీలించి ఆ తర్వాతనే అనుమతి ఇవ్వనున్నారు. మూడు శాఖల్లో ఏఒక్క శాఖ అభ్యంతరం తెలిపిన స్థలాల క్రమబద్ధీకరణకు అవకాశం ఉండదని తెలుస్తుంది. గతంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులే క్షేత్రస్థాయిలో దరఖాస్తులను పరిశీలించి అనుమతులు ఇచ్చారు. దీంతో అక్రమాలకు అవకాశం ఉందంటూ ఆరోపణలు రావడంతో పకడ్బందీగా పథక అమలును చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పూర్తిస్థాయి విధివిధానాలు ఖరారు కాగానే.. దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను చేపట్టేందుకు సంబంధిత శాఖల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.

దరఖాస్తులకు నాలుగేళ్లు

గత నాలుగేళ్ల క్రితం స్థలాలను క్రమబద్ధీకరించుకునేందుకు దరఖాస్తు చేసుకున్నా.. ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పరిష్కార మార్గం చూపలేదు. దీంతో కొందరు దరఖాస్తుదారులు ఎదురుచూసే ఓపిక లేక స్థలాలను క్రమబద్ధీకరించకుండానే అమ్మేసుకున్నారు. మరికొందరు ఇళ్ల నిర్మాణాలను చేపట్టుకున్నారు. కొన్ని వివాదాస్పద స్థలాలపై కోర్టులో కేసులు వేశారు. మళ్లీ నాలుగేళ్ల తర్వాత దరఖాస్తుదారులకు ఫోన్లు చేస్తే స్పందించడం లేదని అధికారులు చెబుతున్నారు. యజమానుల మార్పుతో కొత్తగా దరఖాస్తులు చేసుకునే పరిస్థితి ఏర్పడింది. అయితే, స్థలాలను రెగ్యూలరైజేషన్ చేసుకోవాలంటే స్థలం మార్కెట్ విలువలో 14 శాతం ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. కానీ సమయానికి నగదు చేతిలో లేకపోవడంతో కొందరు దరఖాస్తుదారులు ఆసక్తి చూపడం లేదని తెలుస్తుంది. ఎల్ఆర్ఎస్ లేకుండానే కొన్ని వెంచర్లలో ప్లాట్లను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిసింది. ఎల్ఆర్ఎస్ పేరిట రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో భారీగా అక్రమాలు, అవినీతి కూడా జరిగినట్లు తెలుస్తుంది. గతంలో దరఖాస్తు చేసుకున్న వారిలో సగానికి పైగా అడ్డదారిలో క్రమబద్ధీకరణ చేసుకున్నట్లు తెలుస్తుంది. ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌ను అమలు చేసి ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం దానికి భిన్నమైన పరిస్థితులే కనిపిస్తున్నాయి.



మూడు నెలల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం

: ఖమర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్, ఆదిలాబాద్



ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను మూడు నెలల్లో పరిష్కారించేలా చర్యలు తీసుకుంటాం. జిల్లావ్యాప్తంగా 19వేల 430 వచ్చాయి. ఇప్పటికే 63 దరఖాస్తులకు అనుమతి ఇవ్వడం జరిగింది. మిగిలిన దరఖాస్తులను పరిశీలించి సక్రమంగా ఉంటే క్రమబద్ధీకరిస్తాం. ప్రత్యేక అధికారుల బృందాలను ఏర్పాటు చేసి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను చేపడుతాం. 2020 ఆగస్టు 26కు ముందు అనుమతులు లేని స్థలాల క్రమబద్ధీకరణకు అవకాశం ఉంటుంది. ఇప్పటికే ప్రభుత్వం విధి విధానాలను ఖరారు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలి

● వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశం ● పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా, ఆయా శాఖల అధికారులు

ఆదిలాబాద్ అర్బన్, ఆగస్టు 3: లక్షలాది కుటుంబాలకు లబ్ధి చేకూర్చే లేఔట్ రెగ్యూలరైజేషన్ (ఎల్ఆర్ఎస్) ప్రక్రియను వేగవంతం చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌లను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్‌లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆగస్టు 31 నుంచి అక్టోబర్ 31, 2020 వరకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను ఆమోదించిందన్నారు. ఈ సమయంలో 25.70లక్షల దరఖాస్తులు వచ్చాయని, ఇందు కోసం జిల్లాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకోవాలని, సిబ్బంది కొరత ఉంటే ఇతర శాఖల నుంచి డిప్యూటేషన్‌పై తీసుకోవాలని, ప్రతిపాదనలు పంపిస్తే రెవెన్యూ శాఖ నుంచి సిబ్బందిని సర్దు చేస్తామని తెలిపారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనకు రెవెన్యూ ఇరిగేషన్, మున్సిపల్ అధికారులతో కూడిన మల్టీ డిసిప్లినరీ బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. క్రమబద్ధీకరణ దరఖాస్తులపై జారీ చేసిన నోటీసులకు సంబంధించిన సమస్యలను నివృత్తి చేసేందుకు అన్ని జిల్లా కలెక్టరేట్‌లు, స్థానిక సంస్థల కార్యాలయాల్లో సహాయ కేంద్రాలు (హెల్ప్ డెస్క్) వెంటనే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియలో భాగస్వాములయ్యే అన్ని స్థాయిల సిబ్బంది, అధికారులకు శిక్షణ, ఎల్ఆర్ఎస్ విధి విధానాలను విడుదల చేసిన నేపథ్యంలో అమలుకు అవసరమైన కార్యాచరణను చేపట్టాలని ఈ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నిబంధనల ప్రకారం మాత్రమే భూముల క్రమబద్ధీకరణ జరగాలని, ఎలాంటి అక్రమాలకు తావులేకుండా ఎల్ఆర్ఎస్ ప్రక్రియను మూడు నెలల్లో పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం మీద ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, మధ్యదళారుల ప్రమేయం లేకుండా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ రాజార్షిషా మాట్లాడుతూ మున్సిపాల్టీలో 19వేల దరఖాస్తులలో, ఏడు వేలు పరిష్కరించడం జరిగిందని, ఇంకా 12వేలు పరిష్కరించే దశలో ఉన్నాయని, పంచాయతీలో 9114 దరఖాస్తులు ఉన్నాయన్నారు. వీటిని మూడు నెలల్లో పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించి టీములను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయ, పంచాయతీ అధికారి శ్రీలత, మున్సిపల్ కమిషనర్, తదితరులు పాల్గొన్నారు.





వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్న జిల్లా కలెక్టర్, అధికారులు

● పెండింగ్ దరఖాస్తులను పరిష్కరంచాలి

ఆదిలాబాద్ అర్బన్: ధరణి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరంచాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ అన్నారు. ధరణి ఫెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై శనివారం హైదరాబాద్ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీఎల్ఏ కమిషనర్ మాట్లాడుతూ ధరణి సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా రూపొందించిన నూతన ఆర్ఓఆర్ ముసాయిదా బిల్లు-2024పై ప్రజలన ఉంచి సూచనలు, సలహాలు స్వీకరించేందుకు సీసీఎల్ఏ వెబ్‌సైట్ ద్వారా అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించాలని, సీసీఎల్ఏ కమిషనర్ సూచనల మేరకు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. తహసీల్దార్, రెవెన్యూ డివిజనల్ అధికారి స్థాయిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను, సకేషన్, పెండింగ్ మ్యూటేషన్ దరఖాస్తులను రికార్డులు పరిశీలంచి వెంటనే పరిష్కరించాలన్నారు. ధరణి దరఖాస్తుల పరిష్కారానికి సంబంధించిన ప్రగతిపై రోజు వారీగా పరిశీలన జరపాలని ఆర్డీఓలకు సూచించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం రాష్ట్ర స్థాయిలో ప్రతీ మంగళవారం, శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పిస్తున్న అర్జీలను ఆయా శాఖలకు బదిలీ చేయడం జరుగుతుందన్నారు. వీటి సత్వర పరిష్కారం జరిగేలా చూడాలని తహసీల్దార్లకు ఆయన ఈ సందర్భంగా సూచించారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఆదిలాబాద్, ఉట్నూర్ ఆర్డీవోలు వినోద్ కుమార్, జీవాకర్‌రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల అక్రమ విక్రయాలను అరికట్టేందుకు ఆధార్ తప్పనిసరి

● జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య



రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య

తలమడుగు, ఆగస్టు 3: ఎరువుల అక్రమ విక్రయాలను అరికట్టేందుకు ఆధార్ కార్డు నెంబర్ తప్పనిసరని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ అర్హులైన రైతులు అందరికీ ఎరువులను విక్రయించాలన్నారు. అదేవిధంగా ఎరువులు అక్రమంగా విక్రయించేందుకు వీలులేకుండా రైతులు ఆధార్ కార్డు నెంబర్‌ను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా రైతులకు ఎరువుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు రైతులకు కావాల్సిన ఎరువులను అందుబాటులో ఉంచాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. కాగా, తలమడుగు సహకార సంఘం ద్వారా ఏడు కేంద్రాల్లో ఎరువులను విక్రయిస్తున్నామని సీఈవో మోతే శ్రీనివాస్ తెలిపారు. అతేకాకుండా రైతు రుణమాఫీ డబ్బులు అందరికీ అందేవిధంగా చూడాలని కోరారు. ముఖ్యంగా రైతులందరూ రైతు బీమాకు నమోదు చేసుకోవాలని సూచించారు. కొత్తగా పట్టా పాస్ బుక్ పొందిన రైతులు ఈనెల ఐదవ తేదీలోగా సంబంధిత వ్యవసాయ అధికారులకు అందించాలని కోరారు. అనంతరం ఎరువుల గోదామును తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో వ్యవసాయ అధికారి మహేందర్, సీఈవో మోతె శ్రీనివాస్, సెక్రెటరీలు సాగర్, భీమ్‌రావు, సిబ్బంది, సత్యనారాయణ, రమాకాంత్, తదితరులు పాల్గొన్నారు.

'మొక్కలు నాటి పరిరక్షించాలి'

దిలావర్‌పూర్, ఆగస్టు 3 : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాలని తహసీల్దార్ స్వాతి అన్నారు. శనివారం మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవస్థానం ప్రాంగణంలో మొక్కలు నాటారు. మొక్కలు నాటడంతోనే మన బాధ్యత తీరిపోదని వాటిని పెంచాలన్నారు. మొక్కలతో పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌ఐ సంతోష్, దేవస్థానం చైర్మన్ మహేష్ కుమార్, దేవస్థానం పాలకవర్గం సభ్యులున్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

● సోన్ సీఐ నవీన్ కుమార్

మామడ రూరల్, ఆగస్టు 3 : ప్రతి వాహనదారుడు రోడ్డునిబంధనలు పాటించాలని సోన్ సీఐ నవీన్ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో మామడ ఎస్సై సందీప్‌తో కలిసి జాతీయ రహదారిపై ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ... డ్రైవింగ్ చేసేవారు లైసెన్స్ కలిగి ఉండాలని, వాహన బీమా తప్పనిసరి అని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపినట్లయితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. మద్యం తాగి వాహనం నడిపే ముందు మీ కుటుంబ సభ్యులను గుర్తు చేసుకోవాలని కోరారు. మైనర్ బాలులకు మోటార్ సైకిళ్లు ఇవ్వడం నేరమని, కుటుంబ యజమానిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలన్నారు. సరైన ధ్రువపత్రాలు లేని పది వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ సమయస్ఫూర్తితో వాహనాలను నడపాలని కోరారు. మనం బాగుంటేనే మన కుటుంబం బాగుంటుంది. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని కోరారు. వీరి వెంట సిబ్బంది లక్ష్మణ్ గౌడ్, కారం శంకర్‌లు తదితరులు ఉన్నారు.

స్వచ్ఛదనం.. పచ్చదనంపై అవగాహన కల్పించాలి

నర్సాపూర్(జి) ,ఆగస్టు 3 : ఈ నెల 5నుంచి 9వ తేదీ వరకు రాష్ట్రప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం.. పచ్చదనంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని మండల ప్రత్యేకాధికారి అంజిప్రసాద్ సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో శనివారం వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో కార్యక్రమం ద్వారా పరిసరాల పరిశుభ్రతతో పాటు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని కోరారు. మరుగుదొడ్లు లేని వారి వివరాలు సేకరించి నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాలని ఆయన ఈసందర్భంగా సూచించారు.

స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 3: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, కమిషనర్ ఖమర్ అహ్మద్ పేర్కొన్నారు. ఈనెల 5నుంచి ప్రారంభం కానున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంపై శనివారం ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. వార్డుల్లో సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమం తోడ్పడుతుందన్నారు. ఇందులో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

బోథ్: ఈనెల 5నుంచి 9వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛత పచ్చదనం కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని అన్ని గ్రామాల్లో కార్యదర్శులు కార్యక్రమాలను విజయవంతం అయ్యేవిధంగా చూడాలని ఇన్‌చార్జీ ఎంపీడీవో జీవన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, ఉద్యోగుల ర్యాలీ ఉంటుందని, ఆయా రోజులలో చేపట్టే కార్య క్రమాల గురించి వివరించారు. అలాగే, శనివారం ఈ విషయమై సోనాల గ్రామంలో గ్రామ కార్యదర్శి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలతో సమావేశం నిర్వహించడం జరిగింది.

ఐటీఐలో ప్రవేశానికి గడువు పొడిగింపు

మావల, ఆగస్టు 3: ఎన్‌సీవీ ప్యాటర్న్ కింద ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ ట్రేడ్స్‌లలో శిక్షణకై ఐటీఐలో రెండవ దశలో సీటు సాధించి రిపోర్టు చేయని విద్యార్థులకు ఈనెల 5వ తేది వరకు అడ్మిషన్‌కు గడువు పొడిగిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

రేపు బంజరదొడ్డిలోని పశువుల వేలం

బోథ్, ఆగస్టు 3: ఈనెల 5న సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు బంజరదొడ్డిలో ఉన్న పశువులకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు గ్రామ పంచాయతీ ఈవో పి.అంజయ్య తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.5 వేల దరావత్తుగా చెల్లించి పాటలో పాల్గొనాలని ఆయన సూచించారు.

గురుకుల పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరం

ఇచ్చోడ, ఆగస్టు 3: మండలకేంద్రంలోని గురుకుల పాఠశాలలో శనివారం ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు వైద్యుడు బి.నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించామని, ఇందులో అవసరమైన పిల్లలకు మందులను అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే వర్షాకాలం నేపథ్యంలో ప్రబలుతున్న మలేరియా, టైఫాయిడ్, వ్యాధులు పట్ల అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే సిబ్బంది, ఫార్మసిస్ట్ అరుణ్, ఏఎన్‌ఎమ్ రోజా, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్త


హాజరైన ఉపాధ్యాయులు

ఆశ్రమ పాఠశాలల్లో స్పోకెన్ ఇంగ్లీష్ క్లబ్‌లు

● ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త ● ఉట్నూర్‌లో రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ● పాల్గొన్న ఆంగ్ల బోధన ఉపాధ్యాయులు

ఉట్నూర్, ఆగస్టు 3: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు ఆంగ్ల భాష నైపుణ్యాల అభివృద్ధి కోసం ఈ విద్యా సంవత్సరం నుంచి 133 ఆశ్రమ పాఠశాలల్లో స్పోకెన్ ఇంగ్లీష్ క్లబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఎడ్యుకేషన్ అండర్షిప్ కలెక్టికల్ ఆధ్వర్యంలో ఆంగ్ల బోధన ఉపాధ్యాయులకు రెండు రోజులు శిక్షణ కార్యక్రమాన్ని ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం నగరంలో ఉన్న పీఎంఆర్సీ భవనంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీచర్స్ హ్యాండ్‌బుక్‌లను పీఓ ఖుష్బుగుప్తా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్లబ్బుల నిర్వాహణ ఆంగ్ల బోధన ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో కృత్యాధర బోధన చేపట్టాలని ప్రతి విద్యార్థి ఆంగ్ల భాషలో దారాళంగా మాట్లాడే విధంగా తయారు చేయాలని ఉపాధ్యాయులను కోరారు.ప్రతివారం ఉపాధ్యాయులకు ప్రత్యేక షెడ్యుల్ రూపొందిస్తున్నామని, ఈ కార్యక్రమం అమలుకు ప్రత్యేక అధికారులను నియమిస్తామన్నారు.ఈ కార్యక్రమాన్ని ఏసీఎంఓ ఆధ్వర్యంలో అమలు చేస్తూ పీఎంఆర్సీ సిబ్బంది పర్యవేక్షించాలని ఆదేశించారు. సహజంగా విద్యార్థులు ఆత్మ న్యూన్యత భావంతో ఉంటారని వారిలో ఆత్మస్థైర్యం నింపాలని దానికి ప్రతి ఉపాధ్యాయుడు నిరంతరం నూతన విషయాలు నేర్చుకుంటు ఇన్నోవేటివ్ పద్ధతిలో గ్రూప్ టీచింగ్ చేస్తూ ఆంగ్ల భాష బోధన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంఓ జగన్, జీసీడీఓ చాయా, రిసోర్స్ పర్సన్స్ గోవిందరావు, శంకర్, తొడసం దేవరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఇచ్చోడలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద



ఆదిబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న రిమ్స్ వైద్య సిబ్బంది

ముర్రు పాలతో పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి

● ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద

ఇచ్చోడ, ఆగస్టు 3: ముర్రు పాలతో పిల్లల్లో రోగనిరోధక శక్తి మరింత మెరుగు పడుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శనివారం ఇచ్చోడ మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు అవగాహన కల్పించారు. తల్లిపాలతో కలిగే లాభాల పోతపాలతో కలిగే నష్టాలను వివరించారు. ఇచ్చోడలోని 7వ కేంద్రం పరిధిలో చిన్నారులు, బాలింతలతో తల్లిపాల వారోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోషకాహార వస్తువులపై అవగాహన కల్పించి పోషకాహార విసిష్టతను తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు అనసూయ, స్వప్న, సంగీత, కళాబాయి, ప్రేమ కుమారి, ఆలీయబేగం, సూర్య ఆశా వర్కర్ సునిత అంగన్‌వాడీ ఆయాలు, చిన్నారులు, బాలింతలు, గర్భిణులు, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్: పిల్లలకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్‌రాథోడ్ పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని తల్లిపాలతో కలిగే ప్రయోజనాలపై రిమ్స్ వైద్య, నర్సింగ్ సిబ్బందితో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. తల్లిపాలు ముద్దు డబ్బా పాలు వద్దు అంటూ నినాదాలు చేశారు. బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపు తల్లిపాలను పట్టించాలని సూచించారు. తల్లిపాలతో తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు అనంతరావు, తిరుమలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: వాయిపేట్ సెక్టార్ పరిధిలోని ధర్మాసాగర్ గ్రామంలో శనివారం తల్లిపాల వారోత్సవాలను ఐసీడీఎస్ సీడీపీవో సౌందర్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రసాన కార్యక్రమంతో పాటు తల్లిపాల వారోత్సవాల ఆవశ్యకతను వివరించారు. బిడ్డ పుట్టిన తర్వాత మొదటి ఆరు నెలలు తల్లిపాలే అమృతాహారంగా ఉపయోగపడుతాయని సీడీపీవో సౌందర్య అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ విమల, అంగన్‌వాడీ టీచర్, బాలింతలు, గర్భిణులు, కిషోర బాలికలు, తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి ల్యాబ్స్ ఆధ్వర్యంలో శిక్షణ, ఉపాధి : పీవో

ఉట్నూర్, ఆగస్టు 3: హైదరాబాద్, కరీంనగర్ రెడ్డి ల్యాబ్స్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులకు మూడు నెలల శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నందున గిరిజన యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రికల్ మెకానికల్లో ఐటీఐ, డిప్లొమా చేసిన వారికి సోలార్ ప్యానల్ ఇన్స్టాలేషన్ టెక్నిషియన్, ఎలక్ట్రికల్ వెహికల్ మెయింటెనెన్స్ టెక్నీషియన్ కోర్సులలో శిక్షణ ఉటుందని, కంప్యూటర్ సైన్స్‌లో బీసీఏ లేదా బీఎస్సీ చేసిన వారికి ఫుల్‌స్టాప్ డెవలపర్ కోర్సులో శిక్షణ ఇప్పిస్తామన్నారు. మూడు నెలల శిక్షణ పూర్తి చేసిన తర్వాత తమ సంస్థలోనే ఉపాధి కల్పించడం జరుగుతుందని తెలిపినందున ఆసక్తి గల యువతీ, యువకులు ఈనెల ఐదు నుంచి 10 వరకు ఐటీడీఏ కార్యాల యంలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 901029 5910, 9666748105లలో సంప్రదించాలన్నారు.

ఆర్‌సెట్ ఆధ్వర్యంలో యువతకు శిక్షణ

ఉట్నూర్, ఆగస్టు 3: భారతీయ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉట్నూర్ మండలకేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ కేంద్రంలో ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాలు ఈ నెల12 నుంచి ప్రారంభిస్తున్నామని ఆర్‌సెట్ డైరెక్టర్ మహమ్మద్ గౌస్ తెలిపారు. దీనిలో భాగంగా ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫి, సెల్‌ఫోన్ రిపేరింగ్ శిక్షణలు ఈనెల 12 నుంచి ప్రారంభిస్తున్నామని ఆయన వివరించారు. అదేవిధంగా ద్విచక్ర వాహనం మెకానిజం ఈనెల 28 నుంచి ప్రారంభిస్తున్నామని, దీనికి సంబంధించి ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగులు పదవ తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన వారు 18 నుంచి 45ఏళ్ల లోపు వారు గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగులు అర్హులని తెలిపారు. అలాగే, ఆధార్ కార్డు, చదువుకున్న సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ పత్రం బ్యాంకు అకౌంట్, పాన్ కార్డు, నాలుగు ఫొటోలతో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. శిక్షణ కార్యక్రమం 12 నుంచి ప్రారంభమవుతుందని, 30 రోజులు పూర్తయ్యాక రానుపోను బస్సు చార్జీలు చెల్లిస్తామని, శిక్షణ పూర్తి చేసుకున్న సర్టిఫికెట్‌తో పాటు టూల్ కిట్స్ ఇవ్వడం జరుగుతుందని, శిక్షణ కాలంలో ఉచిత వసతి భోజన సౌకర్యం ఉంటుందని తెలిపారు. ఏవైనా వివరాలు కావాలనుకుంటే తమ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదున్నర గంటల లోపు సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


బీర్ల రవీందర్(ఫైల్)

గుడిహత్నూర్, ఆగస్టు 3: మండలంలోని సీతాగొంది గ్రామంలో జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు గుడిహత్నూర్ ఎస్సై సయ్యద్ ఇమ్రాన్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. సీతాగొందికి చెందిన బీర్ల రవీందర్ (47) అనే వ్యక్తి దాబా నడుపుతున్నాడు. యజమాని కావడంతో రాత్రి 8 గంటల సమయంలో తన ఇంటి నుంచి దాబాకు నడుచుకుంటూ వెళుతున్న సమయంలో రోడ్డు దాటుతుండగా ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కాగా, చికిత్స పొందుతూ రాత్రి 10 గంటల సమయంలో మృతి చెందాడని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కారు బోల్తా.. వృద్ధురాలి దుర్మరణం

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 3: మావల మండల కేంద్రం సమీపంలో జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున ఓ కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో శుభ్రంజు(70) అనే వృద్ధురాలు మృతి చెందగా.. మరొకరు గాయపడ్డారు. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు ఆదిలాబాద్ జిల్లా మావల మండల కేంద్రం సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న గుంతలో పడి బోల్తా కొట్టింది. గమనించిన స్థానికులు 108 సిబ్బందికి సమాచారం అందించారు. గాయపడిన వ్యక్తి మృతురాలి భర్త సంజీవ్ గుర్తించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 3: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. ఆదిలాబాద్ బస్టాండ్ నుంచి గ్రామీణ మండలంలోని లోకారి గ్రామం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు కుమ్రం భీం చౌరస్తా వద్ద జైనథ్‌కు చెందిన గొడుగుల రమణ(55)ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వ్యక్తి తలకు బలమైన గాయమైంది. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని రిమ్స్‌కు తరలించారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

జైనథ్, ఆగస్టు 3: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో ఉన్న ఐదేళ్ల లోపు పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని లక్ష్మీపూర్ గ్రామ ప్రత్యేక అధికారి డీఈ మురళికృష్ణ అన్నారు. శనివారం లక్ష్మీపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో మొక్కలను నాటారు. ఇందులో గ్రామ కార్యదర్శి రవీందర్, వీడీసీ చైర్మన్ దాసరి నారాయణ, అంగన్‌వాడీ టీచర్లు, గోడం మాలిమాల, దేవమ్మ, మమత, మహిళలు, పిల్లలు, గర్భిణులు, తదితరులున్నారు.

రెండు కిలోల గంజాయి పట్టివేత

భోథ్, ఆగస్టు 3: మండలంలోని సోనాల గ్రామంలో శనివారం సాయంత్రం రెండు కిలోల గంజాయి పట్టుకుని ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై బి.రాము తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా.. మండలంలోని చింతలబోరి గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన ఉన్న కిరాణా షాప్ వెనుక గంజాయి నిలువ ఉన్నట్లు పక్కా సమాచారం రావడంతో ఇంటిపై దాడి చేసి నిలువ ఉంచిన గంజాయిని పట్టుకున్నామన్నారు. పట్టుబడిన గంజాయి రెండు కిలోల వరకు ఉందన్నారు. గంజాయి నిలువ ఉంచిన ఇంటి యజమాని ఓంకార్‌ను అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.50 వేల వరకు ఉంటుందని ఎస్సై వివరించారు

రోడ్డుపై కూలిన చెట్టు.. తొలగింపు

ఉట్నూర్, ఆగస్టు 3: శుక్రవారం రాత్రి ఉట్నూర్ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి, ఈదురు గాలులకు ఉట్నూర్ ఆదిలాబాద్ ప్రధాన రహదారిపై పూలాజీ బాబా స్కూల్ సమీపంలో భారీ వృక్షం నేల కూలింది. రాత్రి ట్రాఫిక్ నిలిచిపోవడంతో ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ ఆదేశాల మేరకు ఉట్నూర్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ గండికోట మొగిలి అక్కడికి చేరుకుని జేసీబీ సహాయంతో డీఆర్డీఎఫ్ సిబ్బంది సహకారంతో చెట్టును తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

భవిష్యత్తు తరాలకు మొక్కలే జీవనాధారం : డీఆర్‌డీవో

ఇచ్చోడ, ఆగస్టు 3: భవిష్యత్తు తరాలకు మొక్కలే జీవనాధారమని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జి.సాయన్న అన్నారు. ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కోకస్‌మన్నూర్ గ్రామంలోని కమ్యూనిటీ ప్లాంటేషన్‌లో భాగంగా మూడు వేల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గ్రామంలోని అటవీ నర్సరీని సందర్శించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాటిన ప్రతీమొక్క బతికేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ప్రతీ గ్రామంలో వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీవో నరేందర్‌గౌడ్, ఈసీ సుధాకర్, టెక్నికల్ అసిస్టెంట్ రాజేందర్, ఎఫ్ఏ సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

'లక్షలాది ప్రజల గొంతుక రాజయ్య'


ఆదిలాబాద్ అర్బన్, ఆగస్టు 3: లక్షలాది ప్రజల గొంతుక కామ్రేడ్ సున్నం రాజయ్య అని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో కామ్రేడ్ మాజీ ఎమ్మెల్యే, టీఏజీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కామ్రేడ్ సున్నం రాజయ్య 4వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సచిన్ మాట్లాడుతూ భద్రాచలం ఎమ్మెల్యేగా నాలుగు సార్లు గెలిచి ప్రజా గొంతుకగా కార్మిక, గిరిజన, ప్రజా సమస్యలపై గళం వినిపించారన్నారు. గిరిజనుల సమస్యలపై అనునిత్యం పోరాడేందుకు టీఏజీఎస్ స్థాపించి దాని ద్వారా గిరిజన ప్రజల్లో చైతన్యం చేశారన్నారు. ఇందులో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు స్వామి, కార్యదర్శి లంకరాఘవులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బండి దత్తాత్రి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, నాయకులు సుజాత, పొచక్క, ఆశన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ జిల్లా జైలులో అదాలత్

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 3: ఆదిలాబాద్ పట్టణంలోని జిల్లా జైలులో డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో శనివారం జైల్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా నలుగురు ఖైదీలకు సంబంధించి నాలుగు కేసులను పరిష్కరించారు. ఆ తర్వాత న్యాయాధికారి దుర్గారాణి మాట్లాడుతూ ఖైదీలకు సత్వర న్యాయసాయం అందించేందుకు ఏర్పాటు చేస్తున్న జైల్ అదాలత్ ఖైదీలకు ఎంతగానో దోహదపడతుందని అన్నారు. ఇందులో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ గంగారాం, అశోక్, ఉమేష్, జైల్ పర్యవేక్షణాధికారి అశోక్ ఉన్నారు.

andhrajyothy.com

ఆంధ్రజ్యోతి



శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.5 : కనిష్ఠం 24.2

నిర్మల్ జిల్లా వార్తలు

చేప పిల్లల పంపిణీ ఏదీ?



- ఇప్పటికీ చెరువుల్లో చేప పిల్లలను వదలని యంత్రాంగం
- టెండర్ ప్రక్రియ కూడా పూర్తి కాకపోవడంపై ఆందోళన
- చేప పిల్లల పంపిణీకి ముందుకు రాని వ్యాపారులు
- పెండింగ్‌లో గత సంవత్సరం బిల్లులు

నిర్మల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : వర్షకాలం మొదలై దాదాపు నలభై రోజులు గడుస్తున్నప్పటికీ ఇప్పటి వరకు ప్రాజెక్టుల్లో గాని ఏ ఒక్క చెరువుల్లో గాని చేపపిల్లలను వదలకపోవడంతో ఈ సారి మత్స్యకారుల ఉపాధి ప్రశ్నార్థకం అయ్యే అవకాశాలున్నాయంటున్నారు. గత సంవత్సరం సైతం నాణ్యత లేని చేపపిల్లలను పంపిణీ చేయడం అలాగే ఆలస్యంగా చేపపిల్లలను చెరువులు, ప్రాజెక్టుల్లో వదలడంతో మత్స్యకారులు ఆశించిన మేరకు ఉపాధి దక్కలేదు. అయితే ఈ సారి కూడా చేప పిల్లల పంపిణీ ప్రక్రియ ఇప్పటికి మొదలుకాకపోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే చెరువుల్లో పెరగాల్సిన చేపపిల్లలు ఇంకా ఫామ్‌లోనే ఉండడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతీఏటా ఆగస్టులో చేపపిల్లలను ప్రాజెక్టులు, చెరువుల్లో వదలాల్సి ఉన్నప్పటికి ఆ దిశగా చర్యలు కరువయ్యాయంటున్నారు. జిల్లాలో మొత్తం 548 చెరువులు, ఐదు ప్రాజెక్టుల్లో ఇక్కడి మత్స్యకార శాఖ ప్రతీఏటా చేపపిల్లలను అవసరమైన మేరకు వదులుతూ ఉంటుంది. మొత్తం 240 మత్స్య సహకార సొసైటీల ద్వారా మత్స్యకారులు ఈ చేపపిల్లల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారు. అయితే ఈ సారి 4.15 కోట్ల చేపపిల్లలను ప్రాజెక్టులు, చెరువుల్లో వదలాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గణమైన లక్ష్యం ఉన్నప్పటికి చేపపిల్లల కొనుగోలు టెండర్ ప్రక్రియ ఇప్పటికీ పూర్తి కాలేదు. ఇప్పటికే రెండుసార్లు టెండర్‌లను పిలిచినప్పటికీ చేపపిల్లలను సరఫరా చేసే వ్యాపారులు ముందుకు రావడం లేదంటున్నారు. దీనికి ప్రధాన కారణం గత సంవత్సరం అప్పటి ప్రభుత్వం చేపపిల్లలను సరఫరా చేసిన వ్యాపారులకు బిల్లులు చెల్లించకపోవడమేనంటున్నారు. బిల్లులు చెల్లించని కారణంగా వ్యాపారులు చేపపిల్లలను సరఫరా చేసేందుకు వెనకడుగు వేస్తున్నారని చెబుతున్నారు. ఇటీవల ప్రభుత్వం వ్యాపారులతో సంప్రదింపులు జరిపి మరోసారి టెండర్‌లను నిర్వహించింది. అయితే ఈ టెండర్‌లు ఈ నెల 13వ తేదీన తెరిచే అవకాశాలున్నాయంటున్నారు. ప్రతి ఏటా బోచ్చ, రావు, మిడిగల, బంగారు తీగ లాంటి రకాల చేప పిల్లలను వదిలిపెడుతుంటారు.


చెరువుల్లో విడుదలకు తెచ్చిన చేపలు (ఫైల్)

ఉపాధిపై అనుమానాలు..

మత్స్యకారులకు ఈ ఏడాది పూర్తిస్థాయిలో ఉపాధి దక్కడం అనుమానమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి వరకు చేపపిల్లల పంపిణీకి సంబంధించిన టెండర్ ప్రక్రియ సైతం పూర్తికాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తయినట్లయితే చేప పిల్లలను దూరప్రాంతాల నుంచి జిల్లాకు రవాణా చేసి ఉండేవారని చెబుతున్నారు. టెండర్ ప్రక్రియ పూర్తికాకపోవడంతో ఎప్పటిలోగా చేప పిల్లలను వదిలే ప్రక్రియ పూర్తవుతుందోనన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటికే రిజర్వాయర్‌లు, చెరువుల్లోకి వర్షపు నీరు వచ్చి చేరినందున ప్రక్రియ మొదలైతే గడువులోగా చేప పిల్లలు చేతికి వచ్చేవని పేర్కొంటున్నారు. గత సంవత్సరం నాణ్యత లేని చేపపిల్లలను జిల్లాకు పంపిణీ చేయడంతో దీనిపై మత్స్యకారులు ఆందోళనలు కూడా చేసిన సంగతి తెలిసిందే. నాణ్యమైన చేప పిల్లలను కాకుండా సన్నరకం చేప పిల్లలను వ్యాపారులు సరఫరా చేయడంపై గత ఏడాది అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అయితే ఈ సారి చేప పిల్లలు ఆలస్యంగా వదిలే అవకాశం ఉన్నందున వాటి పెరుగుదల కూడా ఆలస్యంకానున్నట్లు చెబుతున్నారు. ఇదే జరిగితే మత్స్యకారుల ఉపాధి ప్రశ్నార్థకంకానుందని అంటున్నారు.

సొసైటీల వారీగా పంపిణీ..

జిల్లాలో మొత్తం 240 మత్స్య సహకార సంఘాలుండగా ఐదు ప్రాజెక్టులు, 548 చెరువులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ చెరువుల్లో దాదాపు 4.15 కోట్ల చేప పిల్లలను వదలాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఈ లక్ష్యానికి అనుగుణంగా అధికారులు చేపపిల్లల కొనుగోలు వ్యవహారంలో చర్యలు తీసుకోకపోవడం మత్స్యకారులకు ఇబ్బందికరమవుతోందంటున్నారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ఈ సారి చేపలపై ఆధారపడి జీవిస్తున్న వేల మత్స్యకార కుటుంబాలు ఉపాధి కోల్పోయే అవకాశం ఉందని ఆందోళనకు గురవుతున్నాయి. ప్రతీఏటా ఇలాంటి పరిస్థితులే ఎదురవుతున్నాయని పలువురు మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాది మత్స్యకారుల కుటుంబాలు కేవలం చేప వేటపైనే ఆధారపడి జీవిస్తున్నందున ప్రభుత్వం ప్రతీఏటా ముందస్తుగానే చేప పిల్లల పంపిణీపై ప్రణాళికలు రూపొందించి దానికి అనుగుణంగా చర్యలు చేపడితే సమస్యలు ఉండవంటున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఈ ప్రక్రియ అంతా అస్తవ్యస్థంగా సాగుతోందని అంటున్నారు.

పెండింగ్‌లో గత సంవత్సరం బిల్లులు..

ఇదిలా ఉండగా గత ప్రభుత్వం చేప పిల్లలను పంపిణీ చేసిన వ్యాపారులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించకపోవడంతోనే ఈ సారి ప్రక్రియలో జాప్యం జరుగుతోందని అంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చేప పిల్లలను పంపిణీ చేసిన గుత్తేదారులకు ఇప్పటి వరకు బిల్లులు చెల్లించలేదన్న ఆరోపణలున్నాయి. బిల్లుల చెల్లింపులు సక్రమంగా జరగకపోవడంతో ఈ సారి ప్రభుత్వం చేప పిల్లల పంపిణీకి టెండర్‌లు పిలిచినప్పటికీ ఏ ఒక్క వ్యాపారి కూడా ముందుకు రాలేదు. ఎట్టకేలకు ప్రభుత్వం చేపల వ్యాపారులతో చర్చలు జరిపి వారిని ఒప్పించింది. దీంతో కొంతమంది గుత్తేదారులు చేపల పంపిణీకి ముందుకు వచ్చి టెండర్ ప్రక్రియలో పాల్గొన్నారని సమాచారం. కాగా ఈ నెల 13న టెండర్‌లను తెరిచే అవకాశం ఉండడంతో ఎంత మంది కాంట్రాక్టర్‌లు ఎంత పరిమాణంలో చేప పిల్లలను పంపిణీ చేస్తారోననే అంశంపై స్పష్టత వస్తుందని అంటున్నారు.


చేపలు పడుతున్న మత్స్యకారుడు

ఏఈఈలుగా

50మంది ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ఉద్యోగాలు

బాసర, ఆగస్టు, 3 : రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఫలితాల్లో బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్‌ఐటీకి చెందిన పూర్వ విద్యార్థులు ప్రతిభ చాటారు. సుమారు 1100 పోస్టుల్లో 50 మంది ట్రిపుల్ ఐటీ విద్యార్థులే ఉద్యోగాలు సాధించారు. ఎస్సీ కెటగిరిలో సూర్యతేజ అనే ట్రిపుల్ ఐటీ విద్యార్థి మొదటి ర్యాంకు సాధించినట్లు యూనివర్సిటీ అధికారులు తెలిపారు. 2019, 2020, 2021 సంవత్సరంలో ట్రిపుల్ ఐటీలో సివిల్ ఇంజనీర్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈ ఫలితాల్లో 50 మంది ఉద్యోగాలు పొందినట్లు యూనివర్సిటీ అధికారులు తెలిపారు. ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉందని పూర్వ విద్యార్థుల నుంచి సమాచారం అందుతుందని పేర్కొన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు వైస్ చాన్సలర్ వెంకటరమణ ఓ ప్రకటనలో అభినందనలు తెలియజేశారు.

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా డాక్టర్ రాజేందర్



నిర్మల్ కల్చరల్, ఆగస్టు 3 : జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా డాక్టర్ రాజేందర్ బాధ్యతలను శనివారం స్వీకరించారు. ఇప్పటి వరకు పనిచేసిన ధనరాజ్ సాధారణ బదిలీల్లో భాగంగా సిద్దిపేట జిల్లాకు బదిలీ అయ్యారు. డిప్యూటీ విద్యాధికారిగా పని చేసిన రాజేందర్‌కు కలెక్టర్ ఈ బాధ్యతలు అప్పగించారు.

ఆర్టీసీలో టెక్నాలజీతో సమాచారం



నిర్మల్ కల్చరల్, ఆగస్టు 3 : ఆర్టీసీలో టెక్నాలజీ ఉపయోగాలు పెరుగుతున్నాయని రీజినల్ మేనేజర్ సోలమన్ అన్నారు. శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రయాణికులు ఎక్కవలసిన బస్సు వివరాలు, దూర ప్రాంతాల నుండి వచ్చే బంధువుల రాక ఎక్కడ ఉన్నది తెలుసుకోవచ్చునన్నారు. ఇందుకోసం గాను ప్లేస్టోర్‌లో గమ్యం యాప్‌డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, ఏఈ నవీన్‌కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

రూమ్ టు రీడ్ కార్యక్రమాలు సత్ఫలితాలిస్తున్నాయి : డీఈవో

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 3 : పాఠశాలల్లో రూమ్ టు రీడ్ కార్యక్రమాలు విద్యార్థుల్లో నైపుణ్యాలు అభివృద్ధి చెందేందుకు దోహదపడి సత్ఫలితాలిస్తున్నాయని డీఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన నిర్మల్ మండలం అనంతపేట్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రాథమిక విద్యార్థులకు రంగు రంగుల కథల పుస్తకాలు అందజేస్తున్నామన్నారు. ఈ పాఠశాలలో అమలు చేస్తున్న కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. రూమ్ టు రీడ్ సంస్థ వారు రూపొందించే ఎఫ్ఎల్ఎస్‌పై షార్ట్ ఫిలిం డీఈవో ప్రారంభించారు. ఏఎంవో నర్సయ్య, ప్రధానోపాధ్యాయుడు కే. శంకర్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న డీఈవో

పల్లె ప్రకృతి వనాలను పరిశీలించిన అదనపు కలెక్టర్


అదనపు కలెక్టర్‌ను శాలువాతో సన్మానిస్తున్న దృశ్యం

సారంగాపూర్, ఆగస్టు 3 : మండలంలో గల నాగపూర్, బోరిగాం గ్రామాల్లో ఉన్నవంటి పల్లె ప్రకృతి వనాలను శనివారం అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పరిశీలించారు. ఈ నేపథ్యంలో వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని రోడ్లతో పాటు మురికి కాలువలలో చెత్తా చెదారం లేకుండా పచ్చదనం పరిశుభ్రతగా ఉండేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయనను శాలువాతో సన్మానించారు. ఈయన వెంట ఎంపీడీవో లక్ష్మీ కాంతారావుతో పాటు పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

జూనియర్ కళాశాలల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఇంటర్ బోర్డు కమిషనర్‌కు ముథోల్ మాజీ ఎమ్మెల్యే విజ్ఞప్తి


ఇంటర్ బోర్డు కమిషనర్ శృతి ఓజాకు వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

భైంసా, ఆగస్టు 3 : నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నెలకొని ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఇంటర్ బోర్డు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం హైదరబాద్‌లోని ఇంటర్ బోర్డు కార్యాలయానికి వెళ్లి కమీషనర్ శృతి ఓజా, జాయింట్ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, రీజనల్ జాయింట్ డైరెక్టర్ జయప్రదను కలిసి వినతి పత్రాలు అందచేసి మాట్లాడారు. ప్రధానంగా కుంటాల మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో బోధన, బోధనేతర సిబ్బంది నియమించాలని కోరారు. తానూర్ జూనియర్ కళాశాలకు నూతన భవన నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కుభీర్ జూనియర్ కళాశాలలో కొంత మంది సిబ్బంది వేతనాలకు సంబంధించి ఏర్పడ్డ సమస్యలను పరిష్కరించాలని పెర్కొన్నారు. ఇదే క్రమంలో నియోజక వర్గ పరిధిలోని జూనియర్ మౌళిక వసతుల కల్పనకు నిధులు కేటాయించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిన ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు త్వరితగతిన సమస్యల పరిష్కరించే చర్యలు తీసుకుంటామని హమీనిచ్చినట్లుగా తెలిసింది.

వ్యవసాయ సర్వీస్ కనెక్షన్ల మంజూరు వేగవంతం

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 3 : జిల్లాలో రైతులు వ్యవసాయం చేసేందుకు త్వరితగతిన విద్యుత్ సర్వీస్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ బి. శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది 2,031 సర్వీస్ కనెక్షన్లు మంజూరు చేయగా డిసెంబరు 23 నుంచి జూలై 2024 వరకు 2,328 సర్వీస్ కనెక్షన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. 14.6 శాతం కనెక్షన్లు పెరిగాయన్నారు. సర్వీస్ కనెక్షన్లు ఆన్‌లైన్ చేయడంతో స్టేటస్ అగ్రికల్చర్ పోర్టల్‌లో చూసుకునే అవకాశం ఉందన్నారు. ఈ స్టోర్ విధానం ప్రవేశపెట్టడంతో మెటీరియల్ సమయానికి తీసుకొని పనులు ప్రారంభించడం సత్వర మంజూరుకు వీలవుతుందన్నారు. మిగిలి ఉన్న పనులను పేపర్ ట్రాన్సాక్షన్ ద్వారా మార్చుకునే వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచామని, వంగిన పోల్స్, లూజ్ లైన్లను సరి చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు.

'మున్నూరుకాపు సంఘ భవన నిర్మాణానికి కృషి'

భైంసా, ఆగస్టు 3 : భైంసా పట్టణంలో మున్నూరుకాపు సంఘ భవన నిర్మాణానికి కృషి చేస్తానని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ వెల్లడించారు. శనివారం భైంసా పట్టణ మున్నూరుకాపు సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి సంఘానికి స్థలం, భవన నిర్మాణం విషయమై వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ మాట్లాడుతూ ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా సంఘానికి స్థలం కేటాయింపు చేసేందుకు, భవన నిర్మాణాన్ని చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.

ధరణి పరిష్కారానికి చర్యలు : కలెక్టర్ అభిలాష అభినవ్


వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, అధికారులు

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 3 : జిల్లాలో ధరణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. శనివారం సీసీఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి నవీన్ మిట్టల్ హైదరాబాద్ నుండి నిర్వహించిన కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌కు ఆమె హాజరై వివరించారు. మండలాల నుండి వచ్చిన దరఖాస్తులు, వివిధ మాడ్యూల్స్, సెషన్స్, కోర్ట్ కేసులు ఇతర అంశాలు ప్రధాన కార్యదర్శికి తెలిపారు. ఈ సమావేశ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ... పెండింగ్ దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలన్నారు. మండలాల వారీగా తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. తహసీల్దార్లు, ఆర్డీవోలు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించిన పిదపే తర్వాత దశకు పంపించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌కు అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, నిర్మల్ ఆర్డీవో రత్న కళ్యాణి, భైంసా ఆర్డీవో కోమల్ రెడ్డి, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టాలి

జిల్లాలోని మున్సిపల్, గ్రామపంచాయతీల పరిధిలో లేఅవుట్ల క్రమబద్ధీకరణ పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉన్నతాధికారులు, కలెక్టర్లతో వీడియో కన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం వారి సూచనలు అధికారులకు తెలిపారు. క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భూములు సంరక్షిస్తూనే అనుమతులు లేని లేఅవుట్లను, ప్లాట్లను క్రమ బద్ధీకరణకు కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. క్రమబద్ధీకరణపై జిల్లా, మండల, మున్సిపల్ పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, కిషోర్‌కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, డీపీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ రాజు, పంచాయతీ రాజ్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

భైంసాలో బైక్‌పై వచ్చి చైన్ స్నాచింగ్


పల్సర్ బైక్‌పై పారిపోతున్న చైన్‌స్నాచర్స్.. బాధిత మహిళ

భైంసా, ఆగస్టు 3 : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో శనివారం చైన్ స్నాచింగ్ జరిగింది. పట్టణ పరిధిలోని రాహుల్‌నగర్ కాలనీకి చెందిన రెవెన్యూశాఖ ఉద్యోగి సతీమణి బి.లక్ష్మీ అనే మహిళ స్థానిక నిర్మల్ క్రాస్ రోడ్డు మార్గంలోని శివాజీచౌక్ నుంచి ఇంటికి వెళుతుండగా స్నాచింగ్ ఘటన చోటు చేసుకుంది. నిర్మల్ నుంచి వచ్చిన సదరు మహిళ శివాజీచౌక్ వద్ద బస్సు దిగి నడుచుకుంటూ వెల్తుండగా ... పల్సర్ బైక్ పై వచ్చిన ఇద్దరు ఆగంతకులు ఆమె మెడలో నుంచి బంగారు గొలుసు తెంపుకొని ఉడాయించారు. ఘటన నుంచి తేరుకున్న బాధిత మహిళ కేకలు వేసినా ఫలితం లేకుండా పోయింది. అప్పటికే ఆగంతకులిద్దరూ బైక్‌పై అక్కడి నుంచి వేగంగా పారిపోయారు. సంబంధిత స్నాచింగ్ సమాచారం అందుకున్న టౌన్ సీఐ రాజారెడ్డి నేతృత్వంలో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. శివాజీచౌక్ ప్రాంతంలోని సీసీ కెమెరాల్లో ఆగంతకులు బైక్‌పై పారిపోతున్న ఫుటేజీ రికార్డు పరిశీలించారు. ఇందులో స్నాచింగ్‌కు పాల్పడిన అనంతరం ఆగంతుకలిద్దరు బైక్ పై నాందేడ్ క్రాస్ రోడ్డు వైపు వెళ్లినట్లుగా గుర్తించారు. అప్రమత్తమైన పోలీసు అధికారులు డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల పోలీసుస్టేషన్లకు సమాచారాన్ని చేరవేసి ఆగంతకులను పట్టుకునేందుకు చర్యలు చేపట్టారు. అపహరణకు గురైన బంగారు గొలుసు రెండు తులాలు ఉంటుందని బాధితురాలు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పట్టణ పోలీసులు స్నాచింగ్ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

ఇథనాల్ పరిశ్రమ నిర్మాణం ఆపాలని కొనసాగుతున్న 'రిలేదీక్షలు'


కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

దిలావర్‌పూర్, ఆగస్టు 3 : ఇథనాల్ పరిశ్రమ నిర్మాణం ఆపి వేయాలని దిలావర్‌పూర్ గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఇథ నాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం ఎనిమిదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా గ్రామ స్థులు మాట్లాడుతూ... ప్రజలు వద్దన్నా పరిశ్రమ నిర్మాణాన్ని యాజమాన్యం మొండిగా ముందుకు తీసుకెళ్తుండటం దారుణ మన్నారు. ఎట్టి పరిస్థితిలో పరిశ్రమ నిర్మాణాన్ని అడ్డుకుని తీరు తామన్నారు. పిల్లల భవిష్యత్ దృష్ట్యా మా ప్రాణాలు ఇచ్చేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఇప్పటికైనా పరిశ్రమ నిర్మాణం ఆపాలని లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అందుకు అధికారులు, యాజమాన్యం బాధ్యత వహించాల్సి ఉంటుందని వారు పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఒక లెక్క ఇకముందు ఇంకో లెక్క అని అన్నారు.

స్వచ్ఛదనం.. పచ్చదనం విజయవంతం చేయాలి

కుంటాల, ఆగస్టు 3 : మండలంలోని అన్ని గ్రామాలలో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రం కుంటాల రైతువేదికలో పంచాయతీ సెక్రటరీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, మహిళా సంఘాల సభ్యులు తదితరులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐదురోజుల పాటు చేపట్టనున్న ఈ కార్యక్రమాల వివరాలు వారికి వివరించారు. ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రహీం, వైద్యాధికారిణి శృతి, ఎంఈవో ముత్యం, ఏపీవో నవీన్ డిటీ నరేష్ గౌడ్, ఏపీఎం అశోక్ ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

జిల్లాలో వర్షం

నిర్మల్, ఆగస్టు 3 : (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్రమం తప్పకుండా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం నమోదైన వవర్షపాతం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. జిల్లా సగటు వర్షపాతం 6.8 మిల్లీమీటర్లు నమోదు కాగా, జిల్లాలో అత్యధికంగా ఖానాపూర్ మండలంలో 13.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులైన కడెం ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వచ్చి చేరుతుంది. కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 7.603 టీఎంసీలు కాగా ప్రస్తుతం నీటి నిల్వ సామర్థ్యం 6.653 టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 498 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తమై రెండు వరద గేట్లు ఎత్తి గోదావరిలోకి 8,355 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే గడ్డెన్న వాగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 1.825 టీఎంసీలు కాగా ప్రస్తుతం నీటి నిల్వ సామర్థ్యం 1.004 టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుంచి 463 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది.

కాలేయ సమస్యలు తెలుసుకునేందుకు పరీక్షల నిర్వహణ

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 3 : కాలేయ స్థితి తెలుసుకునేందుకు శనివారం విజయ్ పాథాలజీ లాబొరేటరీలో ఫైబ్రోస్కాన్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. 50 మంది పరీక్షలు చేయించుకున్నారు. కేర్ ఆసుపత్రి కార్డియాలజిస్ట్ జోహాన్ క్రిష్టఫర్, డాక్టర్ దిలీప్ కుమార్, తదితరులు శిబిరంకు హాజరై పరీక్షలు జరిపారు. జైడాస్ హెల్త్ కేర్ నుండి సాయి కుమార్, సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ నెరెళ్ల హన్మంతు పాల్గొన్నారు.

శాలువాల పంపిణీ

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 3 : నిర్మల్ పట్టణ పోలీసుస్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ వి. మహేందర్ రెడ్డి తన తల్లి రాజవ్వ ప్రథమ వర్ధంతి సందర్భంగా బస్టాండ్ ఆవరణలో పేదలకు శాలువాలు పంపిణీ చేశారు. .

పొదుపుతోనే అధిక లాభాలు

కుంటాల, ఆగస్టు, 3: మహిళా సంఘాల సభ్యులు పొదుపుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఏపీఎం అశోక్ అన్నారు. మండల కేంద్రం కుంటాలలో శనివారం వీఓఏలకు జనరల్ బాడీమీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లించినప్పుడే వారికి లాభం చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వీవోఏల అధ్యక్షులు బక్కి మహేష్, కార్యదర్శి గౌతం, కోశాధికారి మట్ట గజ్జారాం, ఉపాధ్య క్షులు లావణ్య, సహాయ కార్యదర్శి హసీనా తదితరులు ఉన్నారు.

